క్లుప్తంగా

200 మందికి నేత్రపరీక్షలు



శిబిరంలో నేత్రపరీక్షలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొండపల్లి: మండల కేంద్రంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, స్థానిక నాయకుడు బుచ్చిరాజు ప్రారంభించారు. శిబిరంలో గ్రామానికి చెందిన వారితో పాటు చుట్టుపక్క గ్రామాలకు చెందిన సుమారు 200 మంది నేత్ర పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 25 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విజ్ఞాన శిబిరం ప్రారంభం



గ్రంథాలయంలో కథల పుస్తకాలు చదువుతున్న పిల్లలు

గంట్యాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని లైబ్రేరియన్ అర్జి ఆదిమూర్తి సూచించా రు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంత రం పుస్తక పఠనంతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించి, వారితో పుస్తక పఠనం చేయించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. పుస్తక పఠనం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తితో పాటు విజ్ఞానం పెరుగు తుందని అన్నారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలపై వినతి



ఎంఈఓ శోభారాణికి వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు స్కూళ్ల యాజమాన్య సంఘ నాయకులు

బొండపల్లి: ప్రైవేటు పాఠశాలల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరుతూ ఏపీ ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యం సంఘం (అప్సా) ఆధ్వర్యంలో గజపతినగ రం నియోజకవర్గ ప్రైవేటు స్కూళ్ల యాజమాన్య ప్రతినిధులు ఎంఈఓ శోభారాణి, ఎంఈఓ-2 అల్లు వెంకటరమణకి సోమవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫారం-1 లో ప్రైవేటు స్కూళ్లకు సంబంధించిన అన్ని వివరాలను ఆన్‌లైన్ చేయాలని ప్రభుత్వం నిబంధన విధించిందని, ఈ నిర్ణయం వల్ల స్కూళ్ల యాజమాన్యానికి తీవ్ర సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ఈనిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఇప్పటికే విద్యాశాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశామని గుర్తు చేశారు. ప్రభుత్వంతో చర్చలు కూడా జరుగుతున్నాయని తెలిపారు.

తహసీల్దార్‌కు ఆర్టీసీ కార్మికుల వినతి



తహసీల్దార్ అరుణకుమారికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్ఎంయూ నేతలు

శృంగవరపుకోట: ఏపీఎస్ ఆర్టీసీలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని ఆర్టీసీ కార్మికులు తహసీల్దార్ అరుణకుమారిని కోరారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకుడు, డిపో కార్య దర్శి ఏ.రాజయ్య, జిల్లా కమిటీ సభ్యులు కె.ఆనంద్, మూర్తి తదితరులు తహసీ ల్దార్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, టికెట్ తీసుకునే బాధ్యత ప్రయాణికులదే అని చెప్పాలని, సర్క్యులర్ ఈ 1/468 అమలు తదితర 20 డిమాండ్లతో ఉన్న వినతి పత్రాన్ని ఆమెకు అందచేశారు.

‘ఉపాధి’ సిబ్బంది నిర్లక్ష్యం..!



పెదవేమలిలో పనిచేస్తున్న వేతనదారులు

- పెదవేమలిలో సోమవారం పనికోల్పోయిన 160 మంది వేతనదారులు
- శనివారం అందించాల్సిన మస్తర్ల సీట్లను సోమవారం కూడా ఇవ్వని వైనం

గంట్యాడ: ఉపాధి హామీ పథకం సిబ్బంది నిర్లక్ష్యం వేతనదారుల పాలిట శాపంగా మారింది.వారి అలసత్వం వల్ల ఏకంగా ఒకే గ్రామంలో సుమారు 160 మంది వేతనదారులు పనికోల్పోయారు. ఫీల్డ్ అసిస్టెంట్ సకాలంలో మస్తర్ల సీట్లు ఇవ్వకపోవడం వల్లే పనికోల్పోయామని వేతనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో సోమవారం కొంతమందికి మాత్రమే ఉపాధి హామీ పథకం పని కల్పించారు. గ్రామంలో 537 జాబ్ కార్డులు ఉన్నాయి. 1000 మందికి పైగా వేతనదారులు ఉన్నారు. గ్రామంలో రోజూ 300 మంది వరకు వేతనదారులు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. గత వారం గ్రామంలో 280 మంది వరకు పనికి వచ్చారు. సోమవారం మాత్రం 111మందికి మాత్రమే పని కల్పించారు. 160 మంది వరకు వేతనదారులకు పని కల్పించలేదు. వీరంతా తమకు ఎందుకు పని కల్పించలేదని ఉపాధి సిబ్బందిని అడిగితే మస్తర్ల సీట్లు రాలేదని, సీట్లు వచ్చే వరకు పనికి వెళ్లవద్దని చెప్పడంతో ఇంటి వద్దే ఉండిపోయారు.

నిబంధన ఇది

ఉపాధి హామీ వేతనదారులకు పని కల్పించాలని ప్రతీ గురువారం మేట్‌లు ద్వారా ఫీల్డ్ అసిస్టెంట్‌కు డిమాండ్ ఫారాలు అందజేస్తారు. వాటి ఆధారంగా శనివారం ఉదయం పని ప్రదేశాల్లోనే మేట్‌లకు వాటిని అందజేయాలి. మరుసటి వారం ఎక్కడకు పనికి రావాలో మేట్‌లు వేతనదారులకు శనివారమే చెప్పాలి. కానీ పెదవేమలిలో అందుకు విరుద్ధంగా ఉపాధి సిబ్బంది వ్యవహరించడం వల్ల మస్తర్ల సీట్లు రాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సోమవారం వరకు మస్తర్ల సీట్లు ఇవ్వకపోవడం వల్ల 160 మంది వరకు ఒక రోజు వేతనాన్ని కోల్పోవాల్సి వచ్చింది. మరి ఈ నిర్లక్ష్యానికి ఎవరు బాధ్యత వహిస్తారో చూడాలి.

షోకాజ్ నోటీసు ఇస్తాం..

ప్రతీ ఫీల్డ్ అసిస్టెంట్ వేతనదారులకు పనికల్పించడానికి సంబంధించిన మస్తర్ల సీట్లను శనివారం సాయంత్రం లోగా జనరేట్ చేసుకుని మేట్లకు అందించాలి. పెదవేమలి ఫీల్డ్ అసిస్టెంట్ మస్తర్ల సీట్లు జనరేట్ చేసుకోవడంలో అలసత్వం వహించారు. అతనికి ఎంపీడీఓ ద్వారా షోకాజ్ నోటీసు జారీ చేస్తాం. దాని ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

– జి. సుందరరావు, గంట్యాడ మండల ఉపాధి హామీ పథకం ఏపీఓ

అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీఓ సత్యవాణి

చీపురుపల్లి: అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని ఓటరు నమోదు అధికారి, ఆర్డీఓ జి.వి.సత్యవాణి సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పక్కా ఓటర్ల జాబితా కోసం ప్రతీ నెలలో మొదటి సోమవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పులు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాల్సి ఉంటుందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని, అలాగే మృతి చెందిన వారి వివరాలను ఓటర్ల జాబితా నుంచి తొలగించాల్సి ఉంటుందన్నారు. జాబితాల్లో మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం కూడా ఉందని చెప్పారు.ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఈశ్వరమ్మ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సూర్యకాంతం, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.హర్షవర్ధిని, రాజకీయ పార్టీల ప్రతినిధులు పీతల మురళి, గవిడి నాగరాజు, విజనగిరి శ్రీను, కోట్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల్లో రక్తహీనత నివారణకు చర్యలు

- ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయిదేవి



బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్న ఐసీడీఎస్ ఆర్జేడీ చిన్మయిదేవి

బొండపల్లి: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు, అసలు ఆ సమస్యే రాకుండా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) పి.చిన్మయిదేవి అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. వేంద్రాం అంగన్‌వాడీ కేంద్రంలో సోమ వారం ఆమె తనిఖీలు చేశారు. కేంద్రంలో రికార్డులు, స్టాకును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు,గర్భిణులు, చిన్నారులకు సక్రమంగా పంపిణీ చేయాలని చెప్పారు. పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడా కార్యకర్తలదేనని అన్నారు. వైద్య సిబ్బంది బాలింతలు, గర్భిణులకు క్రమం తప్పకుండా టీకాలు వేస్తున్నారా లేదా అని పరిశీలించాలన్నారు. ఆర్జేడీ వెంట గంట్యాడ ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి, సూపర్‌వైజర్ జానకి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ధ్యేయం



బోరు ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచా యతీ పరిధి హడ్కోకాలనీలో కమ్యూనిటీ హాల్ వద్ద బోరు ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు బోరు ఏర్పాటుకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు చేశామని చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, ఎంపీటీసీ గిరడ రాందాసు, నాయకులు పతివాడ రాజారావు, దుర్గారావు, గవిడి సురేష్, కర్రోతు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన కల్పిద్దాం...



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సహాయ పీఓ బి.లక్ష్మీబాయి

లక్కవరపుకోట: కిశోర బాలికలకు సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలు, పరిశుభ్రత, తదితర అంశాలపై అవగాహన కల్పించి సంస్కరిద్దామని వియ్యంపేట ఐసీడీఎస్ సహాయ పీఓ బి.లక్ష్మీబాయి సూచించారు.ఏపీ మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు,వెలుగు సిబ్బంది, సచివాలయ మహిళా పోలీస్‌లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు స్థానిక వెలుగు భవనంలో ‘కిశోర బాలికా వికాసం- వేసవి శిక్షణ’ అనే కార్యక్రమంపై సోమవారం శిక్షణ ఇచ్చారు.ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ బాలికా వికాస్ -వేసవి శిక్షణ కార్యక్రమం వచ్చే నెల 10వ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆయా గ్రామాల్లో గల కిశోర బాలికలకు రుతుక్రమం, పరిశుభ్రత,లైంగిక విద్య, పునరుత్పత్తి ఆరోగ్యం,బాల్య వివాహాలు వల్ల కలిగే దుష్ప్రభావాలు,బాలల హక్కులు, కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉన్నత విద్య,నైపుణ్యాలు,కెరీర్ మార్గదర్శకత్వం,ఆన్‌లైన్ భద్రత,సైబర్ నేరాలు,ఆర్థిక అంశాలు ,క్రీడలు తదితర అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.భాగ్యలక్ష్మి, వి.రామకృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లతో ఆరోగ్య పర్యవేక్షణ



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్య కార్యక్రమాల పర్యవేక్షణకు.. మాతా, శిశు మరణాలు తగ్గించడానికి యాప్‌లు ఉపయోగపడతాయని డీఎంహెచ్ఓ జీవనరాణి తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం నుంచి పీహెచ్‌సీ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఆశ యాప్‌లో కొత్తగా పొందుపరిచిన రికార్డులు, రిజిస్టర్లు, మాడ్యూల్ వివరాలు తెలుసుకోవాలన్నారు. మంగళవారం నిర్వహించే ఆశా డే సమావేశంలో శిక్షణలో నేర్చుకున్న అంశాలను తెలియజేయాలన్నారు. ఆశవర్కర్లు తమ రోజువారీ పనిని యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో డీఎల్ఓ డాక్టర్ రాణి, డీఐఓ డాక్టర్ రెడ్డి అచ్యుతకుమారి, డిప్యూటీ డీఎంహెచ్ఓ సూర్యనారాయణ, డీపీహెచ్ఎన్ఓ సత్యవతి, డెమో చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతులు

వేపాడ: మండలంలో ముగ్గురు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతులు రావడంతో రిలీవ్ చేశా మని ఎంపీడీఓ సీహెచ్.సూర్యనారాయణ సోమవారం తెలిపారు. వేపాడ,నల్లబిల్లి, రామస్వామిపేట సచివా లయాల డిజిటల్ అసిస్టెంట్లు కె.సత్యవతి, ఆర్.సత్యంనాయుడు, ఎం.సంతోష్ గ్రేడ్-6 నుంచి గ్రేడ్-5 పంచా యతీ కార్యదర్శులుగా పదోన్నతులు పొందారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తవలస: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలోఅంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఏఈ ఐమంది అప్పారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టౌన్ ఫీడర్‌లో కొత్త విద్యుత్ లైన్ వేయడం, అలాగే పాత లైన్‌లో వైర్లకు ఆనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు, మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రం ,సాయినగర్,బాలాజీనగర్‌కు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

శిథిల భవనాలను తొలగించరూ..



కుమ్మపల్లిలో శిథిలమైన పాఠశాల భవనం

వేపాడ: మండలంలోని పలు గ్రామాల ప్రాథమిక పాఠశాలల్లో నిరుప యోగంగా ఉన్న శిథిల భవనాలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. కుమ్మపల్లి, ఆకులసీతంపేట, గుడివాడ, బక్కునాయుడుపేట గ్రామాల ప్రాథమిక పాఠశాలల్లో భవనాలు శిథిలం కావడంతో వాటిని వినియోగించకుండా వదిలేశారు. ఏ క్షణంలోనైనా కూలిపోయే ఆభవనాల్లోకి విద్యార్థులు ఆడుకునేందుకు వెళుతున్నారని, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగక ముందే వాటిని తొలగించాలని కోరుతున్నారు. ఎంఈఓ బాలభాస్కరరావు వద్ద ఈసమస్యను సాక్షి ప్రస్తావించగా ఇప్పటికే కుమ్మపల్లి, గుడివాడ ఆకులసీతంపేటలో శిథిల భవనాల తొలగింపునకు ప్రతిపాదనలు చేసి ఉన్నతాధికారులకు పంపిం చామన్నారు. అనుమతులు రాగానే తొలగిస్తామని తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

దత్తిరాజేరు: మండల కేంద్రంలోని చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను ఆ పథకం ఏపీఓ కామేశ్వరరావు సోమవారం పరిశీలించారు. పని ప్రదేశంలో వేతనదారుల కోసం తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. మండల వ్యాప్తం గా 35 గ్రామ పంచాయతీల్లో 8 వేల మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారని, రెండు మూడు రోజుల్లో పనికి హాజరయ్యే వేతనదారుల సంఖ్య మరింత పెరగవచ్చని అన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

విజయనగరం గంటస్తంభం: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయు నాయకుడు కె.అప్పలసూరి పిలుపునిచ్చారు. స్వతంత్ర ఫెడరేషన్ల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సీఐటీయూ కార్యాలయంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. మే 10న విజయనగరంలో సదస్సు నిర్వహించాలని.. 16,17,18 తేదీల్లో జిల్లా, మండల కేంద్రాల్లో ప్రదర్శనలు, బైక్ ర్యాలీ చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఎ. జగన్ మోహనరావు పెట్టిన ప్రతిపాదనను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి పి.శంకరరావు, కె.సురేష్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు బెహరా శంకరరావు, రైతు సంఘ అధ్యక్షుడు బి.రాంబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌శక్తులకు దోచిపెడుతున్న వారిపై దేశద్రోహం కేసులు నమోదు చేయాలన్నారు. దేశ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులు, ప్రజలపై ఉందని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి శంకరరావు, రవికుమార్, కె.గురుమూర్తి, అప్పలరాజు, గౌరినాయుడు, కె.ఆదినారాయణ, పాపారావు, రమణ, హరీష్, జగన్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి రథోత్సవం



సత్యసాయి బాబా శత జయంతోత్సవాల్లో భాగంగా పుట్టపర్తి నుంచి విజయనగరం జిల్లాకు వచ్చిన సత్యసాయి ప్రేమ ప్రవాహిని ప్రచార రథం సోమవారం బొండపల్లి మండలంలోని కొవ్వాడపేట గ్రామానికి చేరుకుంది. రథానికి గ్రామంలోని సత్యసాయి సేవాసమితి సభ్యులు, మహిళలు కలశాలు, పూర్ణకుంభాలతో స్వాగతం పలికారు. అనంతరం రథాన్ని పూలతో అలంకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బాల వికాస్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ ఎస్.వెంకటరమణ, జోనల్ కన్వీనర్ ఎస్.నారాయణప్పడు, సభ్యులు పాల్గొన్నారు. – బొండపల్లి

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన పంటలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని డిప్యూటీ తహసీల్దార్ సునీత అన్నారు. కొత్తవలస తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ పంట ఉత్పత్తుల స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేశారు.దేవాడ, వియ్యంపేట గ్రామ సంఘాల్లోని రైతులు సాగుచేసిన వేరు శనగ, చిరుధాన్యాలు, ఉల్లి, కూరగాయలు, ఆకుకూరలను విక్రయించారు. కార్యాలయ సిబ్బందితో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చిన మండల ప్రజలు వాటిని కొనుగోలు చేశారు. – కొత్తవలస

విజయోత్సవ ర్యాలీ



ఇటీవల విడుదలైన పదోతరగతి పరీక్షల్లో కొట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఈ పాఠశాల విద్యార్థినియే జిల్లా టాపర్‌గా నిలవడంతో హెచ్ఎం పద్మావతి ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థు లతో కలిసి ఉపాధ్యాయులు తలారి,కొట్యాడ,కలగాడ,ఖాసాపేట తదితర గ్రామాల్లో ర్యాలీ చేశారు. తమ పాఠ శాల సాధిస్తున్న ఫలితాలపై ప్రచారం చేశారు. అన్ని సదుపాయాలతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులున్న తమ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను హెచ్ఎం పద్మావతి కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి ప్రభుత్వ బడిని రక్షించుకుందామని పిలుపునిచ్చారు. – లక్కవరపుకోట

పుస్తకాల స్టాక్ పాయింట్‌ల పరిశీలన



వేపాడలోని స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష జిల్లా సెక్టోరియల్ బృందం

వేపాడ/ కొత్తవలస: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 2025- 26 విద్యాసంవత్సరంలో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య, నోట్ పుస్తకాలను వేపాడ విద్యావనరుల కేంద్రం, కొత్తవలస ఉన్నత పాఠశాలలో భద్రపరిచారు. ఈ స్టాక్ పాయింట్‌లను సమగ్ర శిక్ష జిల్లా సెక్టోరియల్ బృందం సోమవారం పరిశీలించింది. జిల్లా కేంద్రం నుంచి స్టాక్ పాయింట్‌లకు వచ్చిన పుస్తకాలపై వేపాడ ఎంఈఓలు నాగభూషణం, బాలభాస్కరరావు, కొత్తవలస ఎంఈఓ-2 బండారు శ్రీనివాసరావును బృంద సభ్యులు సీఎంఓ ఎం.ఆదినారాయణ, ఏపీఓ వి.గోపీచంద్, ఏఎంఓ బి.ప్రసాద్, అసిస్టెంట్ సీఎంఓ కె.రామారావును ఆరా తీశారు. ఇప్పటివరకు మండలాల నుంచి ఎంత ఇండెంట్ పెట్టారు, ఎన్ని పుస్తకాలు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు.

మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలి

- జడ్జి విజయ్‌రాజ్ కుమార్



అవగాహన కల్పిస్తున్న జడ్జి విజయ్‌రాజ్‌కుమార్

గజపతినగరం: స్త్రీలు సమాజంలో గౌరవ ప్రదంగా నడుచుకుంటూ తమ హక్కులను పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.విజయ్‌రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు పలువురు మహిళ లకు చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల్లో తలెత్తే ఆరోగ్య సమస్యలను వివరించారు. గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి.ఎస్.ఎస్.కె.శ్రీనివాసరావు, బార్అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.